సాక్షి
ములుగు
ఆదివారం | 21 | సెప్టెంబర్ | 2025



బంగారు నాణేల ఆశ చూపి..

బంగారు నాణేల ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి రూ.6.50లక్షలు కొల్లగొట్టిన ఘటన రఘునాథపల్లి మండలంలో చోటు చేసుకుంది.

- 10లో ▸



అడవిని పంచుకుని వేట..

అడవి జీవరాశులను చంపడానికి వేటగాళ్లు ఒకరి పరిధిలోకి మరో వేటగాళ్ల ముఠా రాకుండా ఒప్పందం చేసుకుని మరీ వేటాడుతున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33⁰/23⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

23న మేడారానికి సీఎం రేవంత్‌రెడ్డి



ములుగు: జిల్లాలోని ఎస్‌ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని మేడారం సమ్మక్క–సారలమ్మ సన్నిధికి ఈ నెల 23(మంగళవారం)న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిసింది. మేడారం అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో సందర్శించి అధికారులకు పలు సూచనలు చేయనున్నారు. అభివృద్ధిపై సమీక్ష అనంతరం డిజైన్లను సీఎం రేవంత్‌రెడ్డి ఖరారు చేస్తారని సమాచారం. శనివారం మేడారం అభివృద్ధి ప్రణాళికపై ఐసీసీసీలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

సామాజిక సేవలో ముందుండాలి



ములుగు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో ముందుండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, సామాజిక సేవ, మూఢ నమ్మకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యువత ప్రజలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. అనంతరం కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తుమ్మ పిచ్చిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తడక సుధాకర్, సంజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శాంత కుమార్, నరేష్, రమ్య, అభిలాష్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

ఏటూరునాగారం: ఉపాధి హామీ వేతనాలను కూలీలకు తక్షణమే చెల్లించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కర్నే లాజర్ శనివారం ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఉపాధి అనేక మంది కూలీలు ఉపాధి పనులు చేసి ఆరు నెలలు గడిచినా ఇంకా డబ్బులు రాలేదని వివరించారు. కూలీలకు ఉపాధి హామీ డబ్బులు చెల్లించడంలో అధికారులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సత్వరమే డబ్బులు చెల్లించకుంటే డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

కృష్ణబాబుకు సన్మానం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని సడిబాక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ టాస్, ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపికైన పీర్ల కృష్ణబాబును శనివారం లక్ష్మీనగరం కాంప్లెక్స్ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమౌళి, బొగ్గుల లక్ష్మయ్య, గోవర్ధన్, బుచ్చయ్య, బాబురావు, నర్సింహచారి, సరిత పాల్గొన్నారు.

పలువురు మైనింగ్ అధికారుల బదిలీ

భూపాలపల్లి అర్బన్: ఏరియాలో వివిధ గనుల్లో విధులు నిర్వర్తిస్తున్న మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ సింగరేణి డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏరియాలోని కేటీకే ఓసీ–3కి చెందిన ఎరుకల శ్రీనివాస్ మణుగురుకు బదిలీ కాగా.. ఏరియాలోని కేటీకే 8వ గని నుంచి రాంబాబు కేటీకే ఓసీ–3కి, కేటీకే 5వ గని నుంచి నారాయణ కేటీకే 6వ గనికి, 6వ గనికి చెందిన జీ సంపత్ కేటీకే ఓసీ–3కి, కేటీకే 1వ గని నుంచి మనోజ్‌కుమార్ కేటీకే ఓసీ–3కి బదిలీ కాగా ఎం.రమేష్ అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ నుంచి కేటీకే 5వ గని మేనేజర్‌గా, సునీల్‌కుమార్ కేటీకే 8వ గనికి బదిలీపై వచ్చారు.

కారిడార్ భూసేకరణ పూర్తి చేస్తాం

భూపాలపల్లి: నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు నిర్మించనున్న కారిడార్‌కు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 12 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడించారు. నాగ్‌పూర్–విజయవాడ కారిడార్ నిర్మాణ భూసేకరణపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి సీఎస్ రామకృష్ణారావు శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగ్‌పూర్–విజయవాడ కారిడార్, మహదేవపూర్–కాళేశ్వరం ఎన్‌హెచ్ వెడల్పునకు అటవీశాఖ భూ కేటాయింపు పురోగతిపై సీఎస్ సమీక్షించారు.



పూలను కొనుగోలు చేస్తున్న మహిళలు

పూల సంబురం

- నేటి నుంచి బతుకమ్మ వేడుకలు
- జోరుగా పూల అమ్మకాలు
- బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ
- తొమ్మిది రోజుల పాటు ఆడిపాడనున్న మహిళలు

ములుగు/ఏటూరునాగారం: పూలను దైవంగా భావించి ఆరాధించే పండుగ బతుకమ్మ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ వేడుకల్లో భాగమైన బతుకమ్మ, దసరా పండుగలతో జిల్లాలోని పల్లెలు, పట్టణాలు సందడిగా మారాయి. పూల అమ్మకాలు, దుకాణాలు, రంగుల షాపులు కొనుగోళ్లతో కిక్కిరిసి పోయాయి. నేటి నుంచి ఆరంభమయ్యే బతుకమ్మ వేడుకల్లో 9 రోజుల పాటు అంగరంగవైభవంగా ఆడపడుచులు ఆడి పాడనున్నారు. బతుకమ్మ వేడుకలకు ఇంటికి చేరుకునేందుకు అత్తగారి ఇంటి నుంచి పుట్టింటికి వచ్చేందుకు ఆడపడుచులు ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. దేవాలయాలతో పాటు ప్రత్యేక ఆట స్థలాలను అధికారులు చదును చేయించి లైటింగ్ ఏర్పాటు పనులు చేయించారు.

ఏటూరునాగారం బస్టాండ్‌లో ప్రయాణికులు



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు



ఆర్టీసీ బస్సుల్లో రద్దీ

జిల్లాలోని పలు ఆర్టీసీ బస్టాండ్లలో శనివారం రద్దీ కనిపించింది. పండుగ కావడంతో బస్సులు సమయానికి రాకపోవడంతో గంటల తరబడి ప్రయాణికులు బస్టాండ్‌లో పడిగాపులు పడ్డారు. హాస్టళ్లు, వసతి గృహాల నుంచి విద్యార్థులు ఇంటి దారి పట్టారు. పూల దుకాణాల వద్ద పూలు కొనుగోలు చేసేందుకు ఆడపడుచులు ఆసక్తి చూపారు. అంతేకాకుండా తంగేడు, టేకు, గునుగు పూల కోసం ఆడపడుచులు ఆడవి బాట పట్టి సేకరించడంలో నిమగ్నం అయ్యారు.



మేడారంలోని గాంధీనగర్‌లో బతుకమ్మ ఆట స్థలాన్ని చదును చేస్తున్న డోజర్

రహదారులు ఇలా.. వెళ్లేదెలా?

- ఎన్‌హెచ్ 163పై అడుగడుగునా గుంతలు
- ఇసుక లారీల టైర్ల అచ్చులు
- ప్రమాదాల బారిన పడుతున్నా.. పట్టించుకోని అధికారులు

గోవిందరావుపేట/ఎస్‌ఎస్‌తాడ్వాయి: జిల్లాలోని జాతీయ రహదారి అధ్వానంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఇసుక లారీల రాకపోకలతో టైర్ల అచ్చులు పడడంతో పాటు 163 జాతీయ రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు ఇలా ఉంటే వెళ్లేదెలా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ప్రయాణికులు పలువురు ప్రమాదాల బారిన పడినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

20 కిలో మీటర్లు గుంతలు

గోవిందరావుపేట మండల పరిధిలోని పస్రా, గోవిందరావుపేట, చల్వాయి, ఎస్‌ఎస్ తాడ్వాయి రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. గోవిందరావుపేట మండలంలోని మచ్చాపూర్ గ్రామం నుంచి పస్రా చివరి వరకు సుమారు 20 కిలోమీటర్ల మార్గం పూర్తిగా గుంతలు, లారీ టైర్ల అచ్చులతో ప్రమాదభరితంగా మారింది. వర్షాలు పడితే ఈ గుంతలు చిన్నచిన్న చెరువుల్లా మారిపోతున్న పరిస్థితి. నీళ్లు ఉన్న సమయంలో గుంతలను గుర్తుపట్టలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు.

భూపాలపల్లి నుంచి బయ్యక్కపేట మీదుగా..

రోడ్ల ధ్వంసంతో మేడారం దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. నార్లాపూర్ నుంచి బయ్యక్కపేట దారిలో రోడ్లు ధ్వంసమై గుంతలను తలపిస్తున్నాయి. భూపాలపల్లి నుంచి బయ్యక్కపేట మీదుగా ప్రైవేటు వాహనాల్లో ఆది, బుధ, గురు, శుక్రవారాల్లో మేడారానికి భక్తులు ఈ రోడ్డు మార్గన వస్తుంటారు. బీటీ రోడ్లు భారీగా దెబతిన్నడంతో రాత్రి వేళలో మేడారానికి వచ్చే వాహనాదారులు అదమరిచి గుంతల్లో పడితే ప్రమాదాల భారీన పడే అవకాశం ఉంది. బయ్యక్కపేట నుంచి గోవిందరావుపేట మండలంలోని పస్రా, నార్లాపూర్‌కు పనుల నిమిత్తం ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు తాడ్వాయి– పస్రా మార్గంలో రోడ్లు దెబ్బతిన్నడంతో ఇసుక లారీలను తాడ్వాయి నుంచి మేడారం, నార్లాపూర్ మీదుగా ఇసుక లారీలు బయ్యక్కపేట నుంచి భూపాలపల్లి వైపు వెళ్లడంతోనే రోడ్లు భారీగా దెబ్బతిన్నాయి.



పస్రాలో జాతీయ రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలో నిలిచిన నీళ్లు



జాతీయ రహదారిపై ఏర్పడిన ఇసుక లారీల టైరు గాడీలు



చల్వాయిలో జాతీయ రహదారి పై పెద్ద గొయ్యి



బయ్యక్కపేట- నార్లాపూర్ మధ్య గుంతలు పడిన రోడ్డు

భయంభయంగా..



రోడ్డు మీద నుంచి ప్రయాణించాలంటేనే భయం వేస్తోంది. రోజూ టోల్ ఫీజు మాత్రం వసూలు చేస్తున్నారు. కానీ రోడ్డు మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదు. అధికారులు రోడ్ల గురించి పట్టించుకోవడం లేదు.

- గుండు రామస్వామి, గోవిందరావుపేట.

రహదారి పునరుద్ధరణ పనులు చేపడతాం..



ఇటీవల కురిసిన వర్షాలతో జాతీయ రహదారి పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం తాత్కాలికంగా గుంతలు పూడ్చే పనులు ప్రారంభించాం. వర్షాలు పూర్తిగా తగ్గాక వెంటనే రహదారి పునరుద్ధరణ పనులు చేపడుతాం.

-బి.కుమారస్వామి, డీఈఈ, ఎన్‌హెచ్

మరమ్మతులు చేయాలి..

నార్లాపూర్ నుంచి బయ్యక్కపేట వరకు రోడ్లు అడుగడుగునా ధ్వంసమయ్యాయి. మేడారానికి వచ్చేపోయే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దెబ్బతినడంతో రాత్రి వేళలో ప్రయాణించేందుకు బయపడాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు త్వరగా స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.

- పత్తిగోపాల్‌రెడ్డి, బయ్యక్కపేట

యూరియా కష్టాలు

ములుగు రూరల్: మండల పరిధిలోని బండారుపల్లిలో రైతులు యూరియా బస్తాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సమయంలో బండారుపల్లి గ్రామానికి 330 బస్తాలను పంపించారు. లారీ సాయంత్రం 5 గంటలకు చేరితే పీఏసీఎస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు సాయంత్రం 6.30 గంటలకు పంపిణీ చేసేందుకు వెళ్లారు. సాయంత్రం సమయంలో వర్షం సైతం పడడంతో కొంత ఆలస్యమైంది. సాయంత్రం 6.30 గంటల నుంచి 7.45గంటల వరకు విద్యుత్ అంతరాయంతో అధికారులు రైతులకు యూరియా బిల్లులు పెట్టడానికి సెల్‌ఫోన్ లైట్ వెలుగులో బిల్లులు రాశారు. రైతులు చీకట్లో యూరియా బస్తాల కోసం పడిగాపులు కాశారు.



సెల్‌ఫోన్ లైట్ల మధ్య యూరియా బిల్లు పెడుతున్న అధికారులు

భూ సేకరణకు రైతులు సహకరించాలి

- ఆర్డీఓ వెంకటేశ్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి పనులు, భూ సేకరణకు రైతులు సహకరించాలని ఆర్డీఓ వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని మేడారంలో గల ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లోని సమావేశ మందిరంలో భూ సేకరణపై బాధిత రైతులతో ఆయన శనివారం సమావేశం అయ్యారు. భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులకు 20 ఎకరాల స్థలం అవసరమని గుర్తించి రైతులతో ఆర్డీఓ వెంకటేశ్ మాట్లాడారు. రైతులు ముందుగా భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తే అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ డిజైన్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ వెనకాల అభివృద్ధి పనులకు భూమి అసరవమని రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరిస్తే భూ ధరలను వారి డిమాండ్ మేరకు ప్రభుత్వంతో చర్చించి న్యాయం చేస్తామన్నారు. భూమికి బదులు భూమి కూడా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల స్థలాల్లో అభివృద్ధి నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడితే భూములు ఇచ్చిన బాధిత రైతుల ఉపాధి కోసం కేటాయించేందుకు సిద్ధమన్నారు. గతంలో ఆర్టీసీ బస్టాండ్ వెనుకల క్యూలైన్ల నిర్మాణానికి భూమి తీసుకుని దానికి బదులు మేడారంలోని స్థలం కేటాయించిన ఇప్పటి వరకు ఎలాంటి భూమిపై హక్కు పత్రాలను ఇవ్వలేదని బాధిత రైతులు ఆర్డీఓకు వివరించగా సర్వే నిర్వహించి వెంటనే పంచానామ చేసి భూమి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చివరికి బాధిత రైతులు మాత్రం భూములు ఇస్తే ఉపాధి కోల్పోతామని భూములు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. రైతులందరితో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సురేష్‌బాబు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశ్

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

- వైఆర్‌జీ కేర్ లింక్ సంస్థ వర్కర్ కిషన్

గోవిందరావుపేట: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్ టి.కిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు శనివారం తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారుగా 90 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ నాలుగు విధాలుగా మానవులకు సోకుతుందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, పరీక్షించని రక్త మార్పిడి, హెచ్‌ఐవీ తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి ఈ నాలుగు మార్గాల ద్వారానే వస్తుందని తెలిపారు. గర్భిణులు తప్పకుండా హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఒకవేళ హెచ్‌ఐవీ అని తేలితే పుట్టబోయే బిడ్డకు ఎయిడ్స్ సోకకుండా మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గర్భిణులు తప్పకుండా ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కిషన్

వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఏటూరునాగారం: డైలీవేజ్ వర్కర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండి.దావూద్ అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు పాత పద్ధతిలోనే కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, జీతాలు తగ్గించే జీవో నంబర్ 64 ను వెంటనే రద్దు చేయాలని చేస్తున్న నిరవధిక సమ్మె శనివారానికి 9వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎండి.దావూద్ మాట్లాడుతూ వర్కర్లు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారి సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పటికే కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని వివరించారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. దసరా పండుగ సమీపిస్తుంటే హాస్టల్ వర్కర్లు మాత్రం ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కమల పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కాటారం: మండలకేంద్రంలోని కేజీబీవీకి చెందిన నాగేశ్వరి సబ్ జూనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 18న జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో నాగేశ్వరి ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి చల్ల సునీత తెలిపారు. ఈ నెల 25నుంచి 28వరకు నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఎస్‌ఓ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని ఎస్‌ఓతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.


ప్రజాస్వామ్య విలువలు తెలిపేందుకు ఎన్నికలు

వెంకటాపురం(ఎం): పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజాస్వామ్య విలువలు విద్యార్థులకు తెలుస్తాయని వెంకటాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాధిక తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ స్టూడెంట్ కౌన్సిల్ పదవులకు శనివారం ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాధిక మాట్లాడుతూ ఎన్నికల్లో విద్యార్థి నాయకుడిగా ఎన్నికయ్యేందుకు పోటీలో ఉన్న విద్యార్థులతో నామినేషన్ల నుంచి ఫలితాలను ప్రకటించే వరకు ఎన్నికల నియమావళిని పాటించినట్లు వివరించారు. ఎన్నికల్లో స్టూడెంట్ కౌన్సిల్ లీడర్లుగా బాలుర నుంచి సృజన్ 42 ఓట్లతో, బాలికల నుంచి వర్షిణి 26 ఓట్లతో విజయం సాధించారని పేర్కొన్నారు. ఎన్నికల్లో విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. పదవి అనేది హక్కుగా కాకుండా బాధ్యత, సేవతో పనిచేయాలని సూచించారు. భవిష్యత్‌లో భావిభారత పౌరులుగా, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎండీ. ఫరీనా బేగం, ఉపాధ్యాయులు జనగాం బాబురావు, ఫిరోజ్, కిరణ్ కుమార్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



ఓటుహక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఏరియా స్థాయి లాల్ టెన్నిస్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా సర్వే అధికారి శైలేంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు కేవలం ఆనందానికి మాత్రమే కాదని ఆరోగ్యానికి, శారీరక ధృడత్వానికి ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మారుతి, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పాక దేవయ్య, కెప్టెన్‌లు మల్లేష్, శ్రీరాములు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రామప్పలో విదేశీయుల సందడి

వెంకటాపురం(ఎం): హైదరాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న 30 మంది విదేశీయులు శిక్షణలో భాగంగా శనివారం రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయాన్ని ఇరాక్, పాలస్తీనా, అర్మేనియా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, శ్రీలంక, వియత్నాం, థాయిలాండ్, ఈజిప్ట్, దక్షిణ సూడాన్, జిబౌటి, ఉగాండా, టాంజానియా, కెన్యా, కోట్ డివోయిర్, గాంబియా, లైబీరియా, ఘనా, మొజాంబిక్, జాంబియా, నమీబియా, మారిషస్, క్యూబా, డొమినికన్ రిపబ్లిక్, సురినామ్ దేశాలకు చెందిన 30 మంది మీడియా ప్రతినిధులు, అధికారులు ఆలయాన్ని సందర్శించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమా శంకర్‌లు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ విశిష్టత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించగా రామప్ప టెంపుల్ బ్యూటీఫుల్ అంటూ కొనియాడారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించి బోటింగ్ చేశారు.



విదేశీయులకు ఆలయ విశిష్టత వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ టీజీఎంఎఫ్‌సీ ఆర్థిక సాయం కింద ఫకీర్, దూదేకుల, దుర్బల ముస్లిం వర్గాల, నిరుద్యోగ యువతకు ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన (మహిళలకు మాత్రమే), రేంవత్ అన్నా కా సహారా మిస్కీను కెలియే పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ అధికారి సర్దార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా యోజన పథకానికి జిల్లాలోని వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథలు అర్హులని తెలిపారు. ప్రభుత్వం నుంచి రూ. 50వేలు ఆర్థిక సాయం అందుతుందని వివరించారు. అర్హత కలిగిన లబ్ధిదారులు మోపెడ్, బైక్, ఈ–బైక్ రూపంలో ఒకే సారి గ్రాంట్ ద్వారా ఆర్థిక సహాయం రూ. 1లక్ష అందిస్తామని వివరించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, చిరునామా రుజువు పత్రాలు జత చేయాలని, 21 నుంచి 55 సంవత్సరాలు వయసు కలిగిన వారు అర్హులని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9989661146/7989022063లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

కోటలో విదేశీయుల సందడి..



మధ్యకోటలోని శిల్పాల వద్ద విదేశీయులు

ఖిలా వరంగల్: చారిత్రక ఖిలా వరంగల్ కోటలో శనివారం విదేశీయులు సందడి చేశారు. హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 15 రోజులుగా శిక్షణ పొందుతున్న వివిధ దేశాల్లోని మీడియా సంస్థలో పనిచేస్తున్న 27 దేశాలకు చెందిన ప్రతినిధులు వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మధ్యకోటలోని నాలుగు కీర్తి తోరణాల నడుమ అద్భుత శిల్ప కళా సంపదను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఖుషిమహాల్, ఏకశిల గుట్ట, రాతి, మట్టికోట అందాలను వీక్షించి ఫిదా అయ్యారు. అంతకు ముందు కాకతీయుల చరిత్రను కోట గైడ్ దేనబోయిన రవి యాదవ్ వివరించారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న కెమెరాలతో శిల్ప కళా సంపదను బంధించారు. కార్యక్రమంలో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్, టీజీటీడీసీ కోట ఇన్‌చార్జ్ అజయ్, పురావస్తుశాఖ కోట ఇన్‌చార్జ్ శ్రీకాంత్, ఎస్సై శ్రవణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



అధికారికి ప్రశంస పత్రం అందజేస్తున్న సీపీ

వరంగల్‌క్రైం : బాలల సంరక్షణకు ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల ముగిసిన ఆపరేషన్ ముస్కాన్ 11వ విడత విజయవంత అభినందన సభను శనివారం హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు చెందిన పోలీస్, మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ఎన్జీఓస్, ఇతర ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ హాజరై మాట్లాడారు. అందరి సమన్వయంతో ఆపరేషన్ కార్యక్రమంలో భాగంగా 177 మంది చిన్నారులకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించామన్నారు. బాలకార్మిక రహిత సమాజ బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్లు వసుధ, అనిల్‌చందర్‌రావు, ఉప్పలయ్య, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, హనుమకొండ బీఆర్‌బీ కోఆర్డినేటర్ అవంతి పాల్గొన్నారు.

బతుకు.. బతికించు



తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

నేడు ఎంగిలి పూలతో వేడుకలు షురూ



వరంగల్ పిన్నావారి వీధిలో పూల అమ్మకాలు



వరంగల్ పోస్టాఫీస్ వద్ద..

హన్మకొండ కల్చరల్: తెలంగాణ సంస్కృతి విభిన్నమైంది. జీవనపోరాటంలో ఎన్ని కష్టాలు ఎదురైనా బతకడం.. దీంతో పాటు ఇతరులు కూడా చల్లంగా బతకాలని భావించడం ఇక్కడి ప్రజల ప్రత్యేకత. బతుకు.. బతికించు.. అన్నదే ఇక్కడి జీవనవేదం. ఆకాశంలో ఇంద్రధనస్సుతో పోటీ పడుతూ.. సృష్టిలో భూమి మీద మట్టి నుంచి వచ్చిన ఎన్నెన్నో రంగుల పూలు.. అలా ఎన్ని పూలు పూసినా అన్ని కూడా పరమాత్ముడి కోసమే అన్నట్లు బతుకమ్మలను పేర్చుకుని ఆ జగన్మాత, పరమేశ్వరుడి ప్రీతికోసం బయలుదేరడమే బతుకమ్మ పండుగ. ఈ క్రమలో నేటి (ఆదివారం) నుంచి ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభయ్యే ఈ వేడుకను ఆడపచులు ఈ నెల 29 సద్దుల బతుకమ్మ వరకు జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తొమ్మిదిరోజుల పాటు జరుపుకోనున్న బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసింది. పార్టీలకతీతంగా నేడు వేయిస్తంభాల దేవాలయం నుంచి బతుకమ్మ ఉత్సవం ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

కరువులో పుట్టిన తల్లి బతుకమ్మ..

19వ శతాబ్దం ప్రారంభంలో అనేక క్షామాలు, కరువులు విలయతాండవం చేశాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తాము చల్లగా బతకడానికి విభిన్న రీతిలో బతుకమ్మ పండుగను ప్రారంభించినట్లు జానపదుల పరిశోధకుల అభిప్రాయం. తెలంగాణ గ్రామాల్లో ఇప్పటికీ ఒకతల్లికి వరుసగా పిల్లలు పుట్టి చనిపోతున్నప్పుడు ఆ ఇంటి వారు పుట్టిన పాపను చాటలో పెట్టి పెంటదిబ్బ మీద కొద్దిసేపు పడుకోబెట్టి పెంటయ్య లేదా పెంటమ్మ అని పేరు పెట్టే సంప్రదాయం కనిపిస్తుంది. ఈక్రమంలోనే బతుకు అమ్మ బతుకమ్మగా పిలిచి ఉంటారని అంటారు. మహిషాసురమర్దన సమయంలో పార్వతీదేవి మూర్ఛిల్లి ఉన్నప్పుడు స్త్రీలు ఆందోళనతో బతుకమ్మ అని పాటలు పాడారని ప్రజల్లో అభిప్రాయం ఉంది.

చారిత్రక విభాతసంధ్యలో..

నిజాం ఫ్యూడల్ రాజుల కింద చాలా సంవత్సరాలు మగ్గిపోయి బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఉండడంతో తెలంగాణ ప్రాంతంలో దేవాలయాలను సందర్శించడం మృగ్యమైపోయింది. అలాంటి చారిత్రక విభాతసంధ్యలో బహిరంగంగా దేవాలయాల్లో జరుపుకునే పూజలకు బదులు అనేక సంప్రదాయాల రూపంలో వచ్చిన ఎన్నో పండుగలు ఆచారాలు ఇప్పటికీ కనిపిస్తాయి. బతుకమ్మ పండుగ అలా వచ్చింది.

బతుకమ్మ కథ..

ధరచోళ రాజైన ధర్మాంగుడు, అతడి భార్య సత్యవతి నోముల ఫలితంగా నూరుమంది సంతానం కలుగుతారు. కానీ ఆ నూరుగురు సంతానం శత్రు రాజులతో జరిగిన యుద్ధాల్లో హతమవుతారు. కుమారులు చనిపోయిన దుఃఖంతో ఆ దంపతులు శివుని కోసం కఠోర తపస్సు చేస్తారు. శివుడు మెచ్చి ప్రత్యక్షమై వరం కోరుకొమ్మని అడుగుతాడు. అప్పుడు ఆ దంపతులు శివుడి ఇల్లాలు అయిన పార్వతిదేవీని తమ పుత్రికగా ప్రసాదించమని అడుగుతారు. ఆ విధంగా పార్వతీదేవి వరంతో సాక్షాత్తు శ్రీలక్ష్మిదేవి.. సత్యవతి, ధర్మాంగుడి దంపతుల పుత్రికగా జన్మిస్తుంది. కశ్యపుడు, అంగీరసుడు, కపిలుడు మొదలైన మునులు ఆ పాపకు బతుకమ్మ అని పేరు పెడుతారు. శ్రీమహావిష్ణువు చక్రాంకుడు అనే రాజు రూపంలో వచ్చి శ్రీలక్ష్మీదేవినే వివాహం చేసుకుంటాడు. వారు అనేక మంది సంతానంతో చాలా కాలం పాటు రాజ్యపాలన చేస్తారు.

ఎంగిలి పూల బతుకమ్మ..

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ వచ్చిందటే ఇంటిల్లిపాదికి సంబురమే. ఆశ్వయుజ శుదర్ధపాడ్యమికి ముందు వచ్చే అమావాస్యను జానపదులు పెత్రమాస అంటారు. బతుకమ్మ పెత్రమాసనాడు ప్రారంభమై మహర్నవమి రోజున సద్దులతో ముగుస్తుంది. మొదటి రోజున ఎంగిలి పూల బతుకమ్మగా, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా జరుపుకుంటారు. బతుకమ్మను పేర్చుకోవడానికి ఒక్కరోజు ముందే పూలు సేకరిస్తారు. అలా తెచ్చుకున్న వారి ఇంటిలో ఈ పూలు ఒకరోజు నిద్ర చేస్తాయి. ఆ విధంగా నిద్ర చేసిన పూలతో బతుకమ్మను పేర్చడం వల్ల ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారు. మొదటి రోజు బతుకమ్మ ఆటను గ్రామంలోని శివాలయం, శివాలయం లేని పరిస్థితుల్లో మరే ఇతర ఆలయంలోనైనా జరుపుకుంటారు.

కొనుగోళ్లతో రోడ్లన్నీ రద్దీ..

బతుకమ్మ పండుగకు పూలు, ఇతర సామగ్రి కొనుగోళ్లు చేయడానికి వచ్చిన వారితో శనివారం రాత్రి రోడ్లన్నీ కిక్కిరిశాయి. హనుమకొండ చౌరస్తా, కుమార్‌పల్లి, టైలర్ స్ట్రీట్ , అంబేద్కర్ సెంటర్, అదాలత్, వరంగల్‌లోని పిన్నవారి వీధి, రామన్నపేట, బట్టల బజార్, కాశిబుగ్గ, గోపాలస్వామి గుడి, హనుమకొండ భవానీనగర్‌బోర్డు, సుబేదారిలోని అమరవీరుల స్తూపం, కాజీపేటలోని బాపూజీ నగర్ తదితర ప్రాంతాల్లో పూల అమ్మకాలు జోరుగా సాగాయి.

పితృ అమావాస్యగా..

తెలంగాణలో ఈ రోజున పితరుల/ పితృఅమావాస్యగా జరుపుకుంటారు. చనిపోయిన తమ ఇంటి పెద్దలకు ఆత్మశాంతి జరగాలని బ్రాహ్మణులకు బియ్యం ఇస్తారు. ఉదయమే తలస్నానం చేసి పొడి దుస్తులు ధరిస్తారు. పల్లెంలో బియ్యం పోసి మోదుగాకు విస్తారులలో పప్పు, చింత పండు, ఉప్పు, కారం, అందుబాటులో ఉండే కూరగాయలు పెట్టుకుని వస్తారు. అయ్యగారింటికి వెళ్లి అతడితో బొట్టుపెట్టించుకుని తిరిగి ఇంటికి వచ్చాక భోజనాలు చేస్తారు. ఈ రోజు పెద్దల (చనిపోయిన ఇంటి పెద్దలు) పేరుమీద బియ్యం ఇస్తారు. ఈ రోజున వీలులేని పరిస్థితి ఉన్నవారు దసరా రోజు బియ్యం ఇవ్వడం సంప్రదాయం.

ఐక్యత స్ఫూర్తిని చాటేలా సంబురాలు..



మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు. ఐక్యత స్ఫూర్తిని చాటేలా సబ్బండ వర్గాలు బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలి. తొమ్మిదిరోజులపాటు జరగనున్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. రాష్ట్రప్రభుత్వం నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలు వేయిస్తంభాల దేవాలయం నుంచి ప్రారంభమవుతాయి.

-కొండా సురేఖ, దేవాదాయశాఖ మంత్రి

మహిళలు సంతోషంగా జరుపుకోవాలి



దేవాదాయశాఖ పరిధిలోని దేవాలయాల్లో బతుకమ్మ ఆడుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మొదటిరోజు నుంచి తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ వరకు మహిళలు సంతోషంగా జరుపుకోవాలి. అమ్మవారి దీవెనలకు పాత్రులు కావాలి.

-రామల సునీత, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయధర్మాదాయశాఖ, వరంగల్

2,677.050 మెట్రిక్ టన్నుల ఐపీఎల్ యూరియా రాక



గూడ్స్ షెడ్‌లో యూరియా దిగుమతిని పరిశీలిస్తున్న ఏఓ రవీందర్‌రెడ్డి

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని గూడ్స్‌షెడ్‌కు శనివారం 2,677.050 మెట్రిక్ టన్నుల ఐపీఎల్ కంపెనీకి చెందిన యూరియా చేరింది. గూడ్స్‌షెడ్‌కు చేరిన వ్యాగన్‌ను కంపెనీ ప్రతినిధులతో కలిసి వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి రికార్డు ప్రకారం పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ ఆదేశాల మేరకు ఐపీఎల్ యూరియాను వరంగల్ జిల్లాకు 417.05 మెట్రిక్ టన్నులు, హనుమకొండ జిల్లాకు 450, ములుగు జిల్లాకు 280, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 500, జనగామ జిల్లాకు 480, మహబూబాబాద్ జిల్లాకు 450 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారు. ఉదయం నుంచే లారీల్లో జిల్లాల వారీగా చేరవేసే కార్యక్రమాన్ని చేపట్టామని వ్యవసాయ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు.

మండలంలో వెలిసిన మావోయిస్టు పోస్టర్లు



టేకులబోరు గ్రామ సమీపంలో వెలిసిన మావోయిస్టు పోస్టర్లు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం పాత్రాపురం, టేకులబోరు గ్రామ శివారుల్లో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి ఇరువైపులా శనివారం మావోయిస్టు కేంద్ర కమిటీ పేరున పోస్టర్లు వెలిశాయి. సీపీఐ మావోయిస్టు 21వ స్థాపన వారోత్సవాలను ఈ నెల 21 నుంచి 27 వరకు దేశ వ్యాప్తంగా విప్లవ స్ఫూర్తితో నిర్వహించండని, విప్లవ ప్రతి ఘాతక కగార్ యుద్ధాన్ని విఫలం చేసేందుకు విశాల ప్రజారాశులను వర్గ పోరాటంలో గెరిల్లా యుద్ధంలో సమీకరిద్దామని సీపీఐ మావోయిస్టు కేంద్ర కమిటీ పిలుపు పేరిట పోస్టరు వెలిశాయి.

అదనపు కట్నం వేధింపులు..

- మహిళ ఆత్మహత్య.. గిర్నితండాలో ఘటన



లైలా(ఫైల్)

కేసముద్రం: అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు భరించలేక ఓ మహిళ ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధి గిర్నితండాలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ వినోద్‌కు గూడూరు మండలం పడమటితండాకు చెందిన తేజావత్ ఈర్య చిన్న కూతురు లైలాతో(24) 2021లో వివాహం జరిగింది. ఆ దంపతులకు రెండేళ్ల కుమారుడు అశ్విన్‌తేజ్ ఉన్నాడు. ఈ క్రమంలో అదనపు కట్నం కోసం లైలాను భర్త వినోద్, అత్త కమిలి, తాత బానోత్ రామకోటి (భర్త వినోద్ తాత) కొంత కాలంగా వేధిస్తున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన లైలా.. ఈనెల13న కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకుని తాగి ఎవరికీ చెప్పలేదు. మరుసటి రోజు కడుపునొప్పి వస్తుండగా తన భర్తకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమెను మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమంగా ఉండటంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఈర్య ఫిర్యాదు మేరకు వినోద్, కమిలి, రామకోటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజు శనివారం తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- బాలాజీనగర్‌లో విషాదం



రంజిత్(ఫైల్)

కాజీపేట: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనతో కాజీపేట 47వ డివిజన్ బాలాజీనగర్ కాలనీలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన రాజారపు రంజిత్(30) ఫారెస్ట్ కార్యాలయ సమీపంలో డ్రై ఫ్రూట్స్ దుకాణం పెట్టుకుని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో షాపు సెల్లార్‌లో నీరు రాకపోవడంతో బోరు వేయడానికి యత్నించగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, రంజిత్‌కు ఈ నెల 5వ తేదీన కుమారుడు జన్మించాడు. ఈ ఆనందంలో ఉన్న రంజిత్‌ను మృత్యువు విద్యుత్ రూపంలో కబలించిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

టీజీఎస్ ఆర్టీసీలో కొలువులు

- వరంగల్ రీజియన్‌లో 130 డ్రైవర్, 78 శ్రామిక్ పోస్టులు
- నూతన జిల్లాల వారీగా ఉద్యోగాల ప్రకటన



హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. డ్రైవర్లు, శ్రామిక్‌ల పోస్టులు భర్తీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,000 డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ పోస్టులు భర్తీ చేయనున్నారు. గతంలో రీజియన్ మొత్తం ఒకే జిల్లాగా ఉండేది. ఈ క్రమంలో నూతన జిల్లాల వారీగా పోస్టులు భర్తీకి నిర్ణయం తీసుకున్నారు. వరంగల్ రీజియన్‌లోని 6 జిల్లాల్లో కలిపి మొత్తం 130 డ్రైవర్, 78 శ్రామిక్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈసారి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియామక ప్రక్రియ పూర్తిచేసి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆర్టీసీకి అందిస్తుంది.

- వరంగల్ రీజియన్‌లో మొత్తం 130 డ్రైవర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ములుగు జిల్లాలో–3, జయశంకర్ భూపాలపల్లి–5, వరంగల్‌లో–29, హనుమకొండలో 41, మహబూబాబాద్‌లో 31, జనగామ జిల్లాలో 21 పోస్టులు భర్తీ చేయనున్నారు. శ్రామిక్ పోస్టులు మొత్తం 78లో మెకానికల్–66, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ నాలుగు చొప్పున, పెయింటర్, వెల్డర్, కటింగ్ అండ్ అప్‌హోల్డర్, మిల్‌రైట్ మెకానిక్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. శ్రామిక్ మెకానిక్ పోస్టులు ములుగు జిల్లాలో–2, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో–3, వరంగల్ జిల్లాలో–15, హనుమకొండలో–21, మహబూబాబాద్ జిల్లాలో 15, జనగామ జిల్లాలో 10, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ పోస్టులు ములుగు, భూపాలపల్లిలో జిల్లాలో ఏమీ లేవు, వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఒక్కో పోస్టు భర్తీ చేయనున్నారు. పెయింటర్ వరంగల్ జిల్లాలో ఒకటి, వెల్డర్ హనుమకొండలో ఒకటి, కటింగ్ అండ్ సీవింగ్ అప్‌హోల్‌స్టర్, మిల్‌రైట్ మెకానిక్ పోస్టులు ఒక్కొక్కటి భర్తీ చేయనున్నారు.
- అక్టోబర్ 8 నుంచి 28 వరకు www. trprb. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. పే స్కేల్ డ్రైవర్‌కు రూ.20,960– రూ.60.080, శ్రామిక్‌కు రూ.16,550 – రూ.45,030. వయస్సు డ్రైవర్లకు 22 నుంచి 35 సంవత్సరాలు, శ్రామిక్‌లు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 5 ఏళ్లు, మాజీ సైనికులకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితి సడలింపు ఇచ్చారు. దరఖాస్తు రుసుం డ్రైవర్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీలకు రూ.300, ఇతరులకు రూ.600. శ్రామిక్ పోస్టులు ఎస్సీ, ఎస్టీలకు రూ.200, ఇతరులకు రూ.400గా నిర్ణయించారు.
- శ్రామిక్ పోస్టులను ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తారు. మొత్త వంద మార్కుల్లో ఐటీఐలో ప్రతిభ ఆధారంగా 90 మార్కులు, నేషనల్ అప్రెంటిస్‌షిప్‌కు 10 మార్కులుంటాయి. ఓసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 50 శాతం, బీసీలకు 45 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం మార్కులను కనీస అర్హతగా నిర్ణయించారు.
- డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు 160 సెంటీమీటర్లకన్నా తక్కువ ఎత్తు ఉండొద్దు. మొత్తం 100 మార్కుల్లో డ్రైవింగ్ టెస్ట్‌కు 60, వెయిటేజీ కింద 40 మార్కులు ఇస్తారు. అభ్యర్థులు కనీస మార్కులు 60 సాధిస్తేనే అర్హత సాధిస్తారు. పదో తరగతి మార్కులు, డ్రైవింగ్ లైసెన్స్ రకం, సీనియారిటీ బట్టి వెయిటేజీ మార్కులు కేటాయిస్తారు. నోటిఫికేషన్ విడుదల నాటికి 18 నెలలకు తక్కువ కాకుండా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. అభ్యర్థులు 1–7వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, అగ్రవర్ణ పేదలు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, బీసీలు నాన్ క్రిమిలేయర్ పత్రాలు దరఖాస్తుతోపాటు జతచేయాలి.

బంగారు నాణేల ఆశ చూపి..

- నమ్మించి మోసం చేసిన కర్నాటక వాసులు
- రఘునాథపల్లి మండలంలో ఘటన



కర్నాటక దుండగులు ఇచ్చిన నకిలీ నాణెలు

రఘునాథపల్లి: బంగారు నాణేల ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి రూ.6.50 లక్షలు కొల్లగొట్టారు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం లక్ష్మీతండా శివారు రామచంద్రగూడెంలో జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రగూడెం గ్రామానికి చెందిన వ్యక్తికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓవ్యక్తి ఫోన్ చేసి హార్వెస్టర్‌తో మీ వరి కోశాను. తన పేరు రమేశ్ అని, తన ఇంటి నిర్మాణ పునాదిలో ఐదు కేజీల బంగారం లభ్యమైందని నమ్మించాడు. వీడియోకాల్ చేసి మూట విప్పి బంగారు నాణేలుగా చూపాడు. కర్నాటకకు వస్తే చూపిస్తానని చెప్పడంతో ఈ నెల 12న రామచంద్రగూడెం వ్యక్తి మరో ఇద్దరితో కలిసి కారు అద్దెకు తీసుకొని అక్కడికి వెళ్లాడు. కర్నాటకలోని ఓ మారుమూల ప్రాంతంలో ఇద్దరు దుండగులు ఉన్న చోటుకు వెళ్లగా నిజమైన రెండు బంగారు చిన్న నాణేలు ఇచ్చాడు. మా దగ్గర ఐదు కేజీల బంగారం ఉందని, బంగారం షాపులో పరీక్షించుకొని ఇవి ఒరిజనల్ అయితేనే కొనుగోలు చేయాలని నమ్మబలికాడు. నాణేలు తీసుకొని జనగామలోని ఓ షాపులో వాటిని పరీక్షించగా అవి నిజమైన బంగారు నాణేలుగా తేలింది. అరకిలో నాణేలకు రూ.20 లక్షలు ఇవ్వాలని దుండగులు పలుమార్లు ఫోన్ చేయగా.. చివరకు రూ.7 లక్షలకు బేరం కుదిరింది. రెండు రోజుల్లో రూ.6.50 లక్షలతో మళ్లీ కారు అద్దెకు తీసుకొని అంతకు ముందు తీసుకెళ్లిన ఇద్దరితో కలిసి ఈ నెల 15న కర్నాటకకు వెళ్లాడు. అక్కడ అంతకు ముందు కలిసిన ఇద్దరు వ్యక్తులు ఓ మూటతో వచ్చి బంగారు నాణేలు విప్పి చూపి అందించారు. ఎక్కువ సేపు ఇక్కడ ఉండొద్దు, డబ్బులు ఇవ్వు అంటూ ఆత్రుత పెట్టడంతో బాధితుడు వారికి రూ 6.50 లక్షలు అప్పగించాడు. అదే సమయంలో దుండగుల ముందస్తు ప్రణాళికలో భాగంగా రెండు ద్విచక్రవాహనాల్లో నలుగురు యువకులు వారి వద్దకు వచ్చారు. నగదు పట్టుకున్న వ్యక్తి చెంపపై కొట్టి భయభ్రాంతులకు గురి చేశారు. ఇక్కడి నుంచి వెళ్లిన వారి రెండు సెల్‌ఫోన్లు లాక్కొని పోలీసులు వస్తున్నారంటూ కర్నాటక వాసులు బెదిరించడంతో కారులో తిరుగు పయనమయ్యారు. తిరుగు ప్రయాణంలో కొద్ది దూరం వెళ్లి మూట విప్పి చూడగా ముందుగా ఇచ్చిన నాణేల మాదిరిగా అవి లేకపోవడంతో మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.

అడవిని పంచుకుని వేట..

- విద్యుత్ ఉచ్చులతో జీవరాశుల హతం
- బోరంపల్లికి చెందిన యువకుడి మృతితో వెలుగు చూసిన ఘటన
- గతేడాదిలో జరిగిన యువకుడి మృతి మిస్టరీని ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సూర్యనారాయణ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై తమాషారెడ్డి

కాళేశ్వరం: అడవి జీవరాశులను చంపడానికి వేటగాళ్లు బరితెగించారు. తమ పరిధిలోని అడవిని కొంత భాగం పంచుకున్నారు. ఒకరి పరిధిలోకి మరో వేటగాళ్ల ముఠా రాకుండా ఒప్పందం చేసుకుని మరీ యథేచ్ఛగా వేటాడుతున్నారు. ఈ క్రమంలో గతేడాదిలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు గోదావరి దాటి అమ్మమ్మ ఇంటికి చేరుకునే మార్గంలో అడవిలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చులకు తగిలి అక్కడికక్కడే ప్రాణం వదిలిన ఘటన మహదేవపూర్ మండలం మద్దుల పల్లి సమీపంలోని బల్లాపూర్ శివారులో జరిగింది. ఈ ఘటనను పోలీసులు ఛేదించారు. ఈ మేరకు శనివారం కాళేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాటారం డీఎస్పీ ఎ.సూర్యనారాయణ, మహదేవపూర్ సీఐ ఎన్.వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. గతేడాది మే 31న బోరంపల్లి గ్రామానికి చెందిన దుర్గం ప్రవీణ్(29) గోదావరి దాటి అడవి మార్గం గుండా మద్దులపల్లిలోని అమ్మమ్మ ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలోని అడవిలో వేటగాళ్లు అడవి జంతువులను చంపడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు అమర్చిన ఇనుప (జీ వైర్) తీగల ఉచ్చులకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం అడవిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న మద్దులపల్లికి చెందిన చకినారపు సంతోష్, వేల్పుల నాగరాజు , కొర్లశేఖర్, చకినారపు బాపు , వేల్పుల సురేశ్, చకినారపు శ్రీనివాస్ పోలీసులకు తారసపడ్డారు. వెంటనే అదుపులోకి తీసుకుని విచారించగా తాము ఉచ్చులు పెట్టామని, సదరు యువకుడి మృతికి కారణమని ఒప్పుకున్నారు. వీరంతా కొన్ని సంవత్సరాలుగా అడవిలో విద్యుత్ తీగలు అమర్చి అడవి జంతువులను చంపి వాటిని తినడం, మాంసం విక్రయాలు జరుపుతున్నారు. దీంతో ఆ ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

వేటకు పాల్పడితే చర్యలు..

కాటారం సబ్‌డివిజన్ పరిధిలో అడవి జీవాలకు ఉచ్చులు బిగించి చంపే ముఠాలను గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. త్వరలో వారిని కూడా బైండోవర్ చేస్తామన్నారు. గతంలో కాటారం మండలం నస్తూర్‌పల్లి వద్ద కూంబింగ్ చేస్తున్న గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వేటగాళ్ల ఉచ్చుకు తగిలి మృతి చెందినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.